క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీఎల్‌డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, నునపర్తి, రావాడ, పరవాడ, భర్నికం, తానాం, పి.బోనంగి, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియా, గొర్లివానిపాలెం, జాజులవానిపాలెం, దేశపాత్రునిపాలెం, ఎస్.బోనంగి, కలపాక, వెన్నలపాలెం పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ పేర్కొన్నారు.

బహుభాషా గ్రంథావిష్కరణ



డాక్టర్ జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బహు భాషా గ్రంథావిష్కరణ జరిగింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు, ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాల ప్రాముఖ్యత అనే అంశంపై రచించిన ×సమాగమ్‌ॅ–బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించిన సుమారు 50 మంది అధ్యాపకులను డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. సాహితీ రంగంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి సేవలను రచయితలు, సిస్టర్ షైజీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రచయితలు ఎస్. దీప్తి, గౌరీనాయుడు, డి. కోటేశ్వరరావు, అనుపమ, మౌసమి, సుజాత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రా' రిషికకు సత్కారం



కేరళలో జరిగిన జూనియర్ మోడల్స్ పోటీలో విన్నర్‌గా నిలిచిన తన్వి రిషిక

సీతంపేట: నగరానికి చెందిన తన్వి రిషిక ఇటీవల కేరళలో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులు సత్కార కార్యక్రమం నిర్వహించారు. తన్వి రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గమనించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తన్వి తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. అనంతరం రిషికను ఘనంగా సత్కరించారు.

గందరగోళంగా సమావేశం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మిక సంఘాలతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశం గందరగోళంగా ముగిసింది. జీతాలపై ఎటువంటి స్పష్టత రాకపోవడంతో అటు యాజమాన్యం, ఇటు కార్మిక సంఘాల తీరుపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో, ప్రతిపక్ష ఐఎన్‌టీయూసీతో 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఆర్ అధికారులు సమాచారం అందించారు. ఏఐటీయూసీ నాయకులు అక్కడికి చేరుకోగా డైరెక్టర్ (పర్సనల్) రావడం లేదని హెచ్‌ఆర్ అధికారులు తెలిపారు. జీతాలపై డైరెక్టర్ స్పష్టమైన హామీ ఇస్తారని భావించిన నాయకులు ఆయన రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈ లోగా ఐఎన్‌టీయూసీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే బిల్డింగ్ కింద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు.

అన్నదాతకు దన్ను



రావలమ్మపాలెంలో అందుబాటులోకి వచ్చిన రైతు భరోసా కేంద్రం



వినియోగంలో ఉన్న గొటివాడ రైతు భరోసా కేంద్రం

సబ్బవరం: వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది.దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది.రైతు భరోసా కేంద్రంలో రైతులకు కావాల్సిన విత్తనాలను రాయితీపై అందిస్తున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సాగులోని మెలకువలు,నూతన వంగడాలను సాగుచేయడం ,సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించే విధంగా కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది.అదేవిధంగా రైతులు వారి పండించే పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే నేరుగా రైతులను నుంచి కొనుగోలు చేస్తుంది.

మండలంలోని 20 సచివాలయాల పరిధిలో 17 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది.ఒక్కో రైతు భరోసా కేంద్రాన్ని రూ.21.80 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించనుంది.దీనిలో భాగంగా ఇప్పటికే మండలంలోని నారపాడు, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, సబ్బవరం, అమృతపురం, గొల్లలపాలెం, అసకపల్లి, గొటివాడ, పైడివాడ అగ్రహారంలోని రైతు భరోసా కేంద్రాలు రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం వేసవి దుక్కులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సమయంలో భూమిని లోతుగా దున్నడం వల్ల కొత్త మట్టి వచ్చి గుల్లగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. తద్వారా భూమి సారం పెరగడంతో పాటు ఖరీఫ్ పంటల సాగుకు అనుకూలంగా మారుతుందని తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

రెండు మూడు రోజుల్లో రైతులకు పచ్చి రొట్ట ఎరువులు రాయితీపై సరఫరా చేయడానికి సిద్ధం చేశాం. ఖరీఫ్ వరి విత్తనాలు కూడా త్వరలో ఆర్‌బీకేలు ద్వారా అందజేస్తామన్నారు. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నిర్మాణ దశలో..

వంగలి, బంగారమ్మపాలెం,మొగలిపురం, బాటజంగాలపాలెం, తవ్వవానిపాలెం, బోదువలస గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి.

మండలంలో వ్యవసాయ భూములు :11,200 ఎకరాలు

వ్యవసాయ,ఉద్యాన పంటల సాగుచేసే భూములు : 8,600 ఎకరాలు

మండలంలో రైతు భరోసా అందించే రైతులు :10,500 మంది

మండలంలోని రైతులకు అందించిన సాయం :రూ.14.20 కోట్లు

వెంకటాద్రిపై ఘనంగా ధ్వజారోహణ



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

- రెండో రోజు వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి:వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణ, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వేతనాల చెల్లింపుల్లో జాప్యంపై ఆందోళన

ఉక్కునగరం: స్టీల్ ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ మరియు మిత్రపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం స్టీల్ ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయంలో వేతనాల కోసం ధర్నా చేశారు.

ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ కర్మాగారం కోసం కష్టపడిన ఉద్యోగులకు జీతాలు ప్రతీ నెలా 7వ తేదీన చెల్లించాలని చట్టం చెబుతోందని, కానీ యాజమాన్యం అందుకు విరుద్ధంగా గడిచిన మూడు మాసాలుగా సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల జీతాల కోసం కేవలం రూ. 90 కోట్లు చెల్లించకుండా కావాలనే యాజమాన్యం కుంటిసాకులు చెబుతోందన్నారు. దీనిపై సీఎండీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. తక్షణమే జీతాలు చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోథీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిటూ నాయకులు, కార్యకర్తలు

ఆదరించి.. ఆశ్రయం కల్పించి..



పూజలు చేస్తున్న ఉత్తర భారతీయులు



దేవాలయంలో సమావేశమైన ఇతర రాష్ట్ర మహిళలు

- ఉత్తర భారతీయులకు కేరాఫ్‌గా దక్షిణ నియోజకవర్గం
- వ్యాపారాలు.. నివాసం.. పిల్లల చదువులు అన్నీ ఇక్కడే
- ఆత్మీయంగా అక్కున చేర్చుకుంటున్న స్థానికులు

దాబాగార్డెన్స్ : విశాఖ సంస్కృతీ సాంప్రదాయాలకు పుట్టినిల్లు. ఏ ప్రాంతం నుంచి వలస వచ్చిన వారినైనా అక్కున చేర్చుకుంటారు ఇక్కడి ప్రజలు. ఏ ప్రాంతం వారైనా ఇక్కడి వాతావరణానికి, సంస్కృతికి అలవాటుపడిపోతారు. బయటి వారు ఎవరైనా ఇక్కడి వారు స్నేహహస్తం చాచి వారిని తమతో కలుపుకుంటారు. ముఖ్యంగా వినాయక చవతి వేడుకలు.. దేవీ నవరాత్రులు.. విశిష్టత గల పండగల్లో స్థానికేతరులను కలుపుకుని ఇక్కడి వారు వేడుకలు నిర్వహిస్తుంటారు. హోలీ పండగతో పాటు దేశవ్యాప్తంగా నిర్వహించుకునే దీపావళి, సంక్రాంతి, శివరాత్రి వంటి పండగలను అంతా కలిసి నిర్వహించుకుంటారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కూడా అంతా ఒక్కటై కనిపిస్తారు.

'దక్షిణ'లో వివిధ మతాలు..కులాలు..

ఇక విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న వారితో పాటు విజయనగరం, పార్వతీపురం (మన్యం జిల్లా) శ్రీకాకుళం, పాడేరు, అనకాపల్లి జిల్లా, తూర్పు, పశ్చిమ జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, తెలంగాణ, ఒడిశా, కోల్‌కతా, నాగాలాండ్, మణిపురి, అస్సాం, బీహార్, ఉత్తరప్రదేశ్, జార్కండ్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు ఎంతో మంది దక్షిణ భారతీయులు విశాఖకు వలస వచ్చి వ్యాపారాలు సాగిస్తూ స్థానికంగా స్థిరపడుతున్నారు. వారి పిల్లల చదువులు కూడా ఇక్కడే సాగుతున్నాయి. ఇక్కడి వారితో మమేకమవుతూ సేవా మార్గాల్లో నడుస్తున్నారు. నమ్మే ఇష్టదైవాల ఆలయాలు కూడా స్థానికంగా నిర్మించుకుంటున్నారు. ప్రతి ఏటా వారి పండగలు ఘనంగా జరుపుకుంటున్నారు.

ఆహారపు అలవాట్లు కూడా ఇష్టపడుతున్నారు..

ఇదిలా ఉండగా ఇక్కడి ఆహారానికి బయటి నుంచి వచ్చిన వారు అలవాటు పడుతున్నారు. అలాగే పానిపూరీ, భేల్‌పూరి, పావ్‌బాజీ వంటి ఇతర రాష్ట్రాల ఆహారానికి ఇక్కడి వారు కూడా అలవాటు పడటం విశేషం. ఈ విధంగా భిన్నత్వంలో ఏకత్వం అనే పురాతన నానుడి విశాఖ దక్షిణలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ట్రాలర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద టాలర్‌ను ట్యాంకర్ ఢీకొట్టింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలివీ.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో సిల్వర్ బ్రిక్స్ బ్యాగుల లోడుతో షీలానగర్ నుంచి ఆటోనగర్ వైపు ట్రాలర్ వస్తోంది. అదే సమయంలో ఆటోనగర్ నుంచి రెడీమిక్స్ కాంక్రీట్ లోడులో ట్యాంకర్ వస్తోంది. సరిగ్గా సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి ట్రాలర్ మలుపు తిరుగుతుండగా.. ట్యాంకర్ ట్రాలర్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో ట్రాలర్ రోడ్డు పక్కనున్న డివైడర్‌పైకి దూసుకుపోయింది. రోడ్డుపై సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు చిందరవందరగా పడిపోగా, కాంక్రీట్ రోడ్డు పాలైంది. సమాచారం అందుకున్న గాజువాక సీఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాలకు కారణమైన రెండు భారీ వాహనాలను క్రేన్‌ల సహాయంతో గాజువాక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిన ప్రమాదంలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం కానీ, గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద కారణంగా రోడ్డుపై పడిన సామగ్రిని తొలగించారు. సాయంత్రం వరకు గాజువాక నుంచి షీలానగర్ వైపు వచ్చే వాహనచోదకులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.

అప్రమత్తతతో డెంగ్యూకు చెక్



వాడచీపురుపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు కనకప్పారావు, క్రాంతి కుమార్ సిబ్బంది

పరవాడ: డెంగ్యూ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాడచీపురుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి వి.కనకప్పారావు అన్నారు. ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడచీపురుపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి కనకప్పారావు మాట్లాడుతూ ఇళ్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోవడం , పరిసర ప్రాంతాల్లో తాగి వదిలిన కొబ్బరి బోండాలు, టైర్లు, నీటి తొట్టెలు, వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారాలు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో దోమలు పెరగకుండా కిరోసిన్ వేయాలన్నారు. డెంగ్యూ జ్వరానికి త్వరగా చికిత్స తీసుకోవడం ద్వారా మరణాలను నియంత్రించవచ్చునని డాక్టర్ కనకప్పారావు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి కుమార్, ఎంపీహెచ్‌వో కృష్ణాజీ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణ మూర్తులు



పాల్గొన్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువైన అలివేలు మంగమ్మ సన్నిధిలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి కుంకుమార్చనలు చేశారు. అనంతరం శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రసాద వితరణ చేపట్టారు.

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో తో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చక్కటి జీవనశైలితో అదుపులో రక్తపోటు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం జంక్షన్ మీదుగా ర్యాలీ కొనసాగి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో నెల రోజుల వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత రక్తపోటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక రక్తపోటుతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాల్సి అవసరం ఉందన్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండ సమస్యలు, అకాల మరణాలకు హైపర్ టెన్షన్ ప్రథమ కారణమన్నారు. చాలా మందికి అధిక రక్తపోటు లక్షణాలు లేకపోయినా, చికిత్స చేయకుండా వదిలేస్తే అది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, మందులు తీసుకోవడం ద్వారా రక్తపోటును నివారించవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు వల్ల ఎంతో మంది మరణిస్తున్నారని అన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అధిక రక్తపోటు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు మరణాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డెమో) బి.నాగేశ్వరరావు, డాక్టర్ జగదీష్‌ప్రసాద్, టీబీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన అవసరం

పెదగంట్యాడ: 30 ఏళ్లు దాటిన వారు విధిగా బీపీ పరీక్షలు చేయించుకోవాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా సూచించారు. ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం 77వ వార్డు సచివాలయం వద్ద వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.